క్లుప్తంగా

అప్పన్న భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: చందనోత్సవం సందర్భంగా అప్పన్న నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు గోపాలపట్నం పరిధిలో లైన్ వ్యాపారం చేసే వర్తకులు ఆదివారం గోశాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భ్కార రావు ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. సుమారు 5000 మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వర్తక సంక్షేమ సేవా సంఘం సభ్యులు బి. గంగాధరం, పి. దామోదరం, పి. గోవింద రాజు, అప్పారావు, ఎన్‌కే ప్రసాద్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాంబిక నెల పండగ



అన్నసమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి నెల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శేఖర్, ప్రధానకార్యదర్శి పెద్దాడ ప్రసాద్, యూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అనసూయకు అభినందన



చినజీయర్ స్వామి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న అనసూయాదేవి

మల్కాపురం: ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో వివిధ కళాశాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎన్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రాగాం అధికారి వై.అనసూయాదేవి వ్యవహరించారు.ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని జరిగిన కార్యక్రమంలో త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా అనసూయాదేవికి సర్టిఫికెట్ అందజేశారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ దారుణం

కూర్మన్నపాలెం: దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన 801వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో పలు విభాగ కార్మికులు కూర్చున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 800 రోజులకు పైగా నిరాటంకంగా ఉక్కు ఉద్యమాన్ని కొనసాగించడం కార్మికుల పోరాట శక్తికి నిదర్శనమన్నారు. ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వమని, నిరంతరాయంగా పోరాటాన్ని విడవకుండా కొనసాగించడం ద్వారా ప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిర్భయంగా ఎదుర్కొంటామన్నారు.

చెత్తను తగలబెట్టేస్తున్నారు..



సుభాష్‌నగర్‌లో డస్ట్ బిన్ వద్ద తగలబెడుతున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, వైర్లు



గొల్ల కంచరపాలెం రైల్వే ట్రాక్ ప్రాంతంలో వ్యాపిస్తున్న పొగ

- కంచరపాలెం పరిధిలో వ్యర్థాలకు నిప్పు
- పొగతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- దృష్టి సారించని అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో చెత్తను ఇష్టానుసారంగా తగలబెట్టేస్తున్నారు. డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్త, ఇతర వ్యర్థాలను రహదారులపై, ఎక్కడ పడితే అక్కడ నిప్పు పెట్టి వదిలేస్తున్నారు. ఆ మంటల నుంచి వ్యాపిస్తున్న దట్టమైన పొగతో స్థానిక ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కంచరపాలెం రైల్వే ట్రాక్ రోడ్డు, సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారులు ఎప్పుడు చూసినా పొగ మంటలతో నిండి ఉంటున్నాయి. 56వ వార్డు గొల్ల కంచరపాలెం నుంచి దుర్గానగర్‌కు వెళ్లే గెడ్డలను ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్ రహదారిలో స్థానిక ఇళ్ల నుంచి వేసే చెత్తను, 57వ వార్డు ఊర్వశి కూడలి సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారుల్లో శానిటరీ డస్ట్ బిన్ల వద్ద చెత్తను తగలేస్తున్నారు. స్క్రాప్ దుకాణాలు, వాహనాల మరమ్మతుల షెడ్లతో ఈ రహదారులు కాలుష్యంతో నిండిపోతున్నాయి. పలు ప్రాంతాల నుంచి తెచ్చిన వ్యర్థాలను ఇక్కడి బహిరంగ ప్రదేశాల్లో దహనం చేస్తున్నారు. వాటి నుంచి దుర్గంధం వెలువడుతుండటంతో వాసన భరించలేక శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దట్టమైన పొగల కారణంగా రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ద్విచక్ర వాహన చోదకులు చెబుతున్నారు.

అల్లరిమూకల ఆగడాలు.. నిత్యం బయట ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్తను ఇక్కడే కుప్పలుగా పోగు చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రాంతాలు డంపింగ్ యార్డ్‌గా మారిపోయాయి. రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో చెత్తకు ఆకతాయిలు నిప్పు పెడుతున్నారని వార్డు శానటరీ సిబ్బంది చెబుతున్నారు. పెట్రోల్ దొంగతనాలు చేసే అల్లరిమూకలు విద్యుత్, కేబుల్ వైర్లు ఇక్కడే కాల్చుతున్నారు. దీంతో కాలుష్య కారక వాయువులు వెలువడుతున్నాయని స్థానికులు భయాందోళనలు వెలువడుతున్నాయి. ఈ సమస్యపై గతంలో అనేక సార్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు. జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు దృష్టి సారించి చెత్తను తగలేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

ఎట్టకేలకు తీరిన తాగునీటి కష్టాలు

- వెంకన్నపాలెంలో కుళాయిల ఏర్పాటు
- కార్పొరేటర్ సుధ చొరవతో చర్యలు



వెంకన్నపాలెం కృష్ణాలయం వద్ద కుళాయి నుంచి పుష్కలంగా వస్తున్న తాగునీరు



సెయింట్ జోసఫ్ స్కూల్ సమీప నివాసాల వద్ద ఏర్పాటు చేసిన కుళాయి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెం ప్రజల తాగునీటి కష్టాలు ఎట్టకేలకు కార్పొరేటర్ కొణతాల సుధ రూపంలో తీరాయి. ఈ ప్రాంత వాసులు సుమారు 30 ఏళ్ల నుంచి నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. నల్ల రాయితో కూడిన కొండ ప్రాంతం కావడంతో బోర్లు వేసినా.. ఇక్కడ నీరు రాదు. దీంతో పారిశ్రామిక ప్రాంతం అంతటా బోర్లు ఉన్నా.. వెంకన్నపాలెం మాత్రం వాటికి నోచుకోలేదు. ఈ ప్రాంత వాసులకు అధికారులు కుళాయి వాటర్ సరఫరా చేసి తాగునీటి కష్టాలను తీర్చే వారు. పబ్లిక్ ట్యాప్‌ల రూపంలో అంతంత మాత్రం నీరు రావడం, అది సరిపోకపోవడంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవడం వంటివి స్థానికులు చేసేవారు. ఈ సమస్యను గుర్తించిన వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ విషయాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి వెంకన్నపాలెంలో పలు చోట్ల కుళాయి కనక్షన్ పాయింట్లు పెట్టించారు. పుష్కలంగా నీరు వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ కుళాయిల నుంచి ఆదివారం వెంకన్నపాలెం వాసులు నీరు పట్టి హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆడారి ఆనంద్‌కుమార్, కొణతాల సుధలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయాలకు అక్షయ తృతీయ శోభ



గోమాత ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తురాలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మల్కాపురం: అక్షయ తృతీయ, చందనోత్సవం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దుర్గాగణపతి ఆలయంలో గణపతి హోమం చేశారు. వేంకటేశ్వరస్వామి, గణపతి తదితర దేవతామూర్తులకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీహరిపురంలోని హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిపారు. చందనోత్సవం సందర్భంగా నక్కవానిపాలెంలో సింహాద్రి అప్పన్న ప్రతి రూపంగా కొలిచే తోడపెద్దు(గోమాత)కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు భక్తులు నేలపై పడుకుంటే వారిపై నుంచి తోడపెద్దును దాటించారు. గోమాత దాటితే వారిని ఆశీర్వదించినట్టు ఇక్కడ భక్తులు భావిస్తారు.

రాంజీ భీమ్‌రావ్ సంఘ అధ్యక్షుడిగా కృష్ణ



దేబార్కి కృష్ణను సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో రాంజీ భీమ్‌రావ్ ఎస్సీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా దేబార్కి కృష్ణ ఎన్నికయ్యారు. సంఘంలో మొత్తం 116 మంది ఓటర్లు ఉండగా బర్రి అప్పారావు, వరపల మహేష్, జామి కృష్ణ, పెంట్ల బాలకృష్ణ, తుంపా మోహనరావు, తెంబూరు గణేష్ పర్యవేక్షణలో అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. రాంజీ భీమ్‌రావ్ అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీపడగా 50 ఓట్లతో దేబార్కి కృష్ణ సంఘ అధ్యక్షుడిగా గెలుపొందారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దేబార్కి కృష్ణను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాగరాజు, శివాజీ, మోహన్, చంద్రయ్య, గురుమూర్తి, రాంప్రసాద్, యశోధ, విమల, చంద్ర, లక్ష్మి, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. హెచ్‌పీసీఎల్‌లో భారీ విస్ఫోటనం జరిగిన సమయంలో 63 మంది ప్రాణాలు పోయినా.. సంస్థను ఆనుకుని ఉన్న మల్కాపురంలో మాత్రం ఎలాంటి నష్టం జరడం లేదు. దీనికి గ్రామదేవత మరిడిమాంబ చల్లని కరుణే అని ఇక్కడ ప్రజల విశ్వాసం. దీంతో 1998 నుంచి ఏటా ఏప్రిల్ మొదలుకుని జూలై నెల చివరి వారంలో ఏదో ఒక ఆదివారం గ్రామంలో ఉన్న 16 కులాల్లో ఏదో ఒక్క కులం వారు అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెద వీర్రాజు

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎస్.కె. బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం 'కథా పరిమళాలు' పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరిరాజు, మేడా మస్తాన్ రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వర రావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీరామమూర్తి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్.ఈశ్వర్‌రావు, సబ్బవరపు శ్రీరామమూర్తి అనే ఇద్దరు వ్యక్తులు నగరంలోని ఆరిలోవలో నివసిస్తున్నారు. వీరు కార్పెంటర్ పని చేస్తుంటారు. వీరిద్దరు ఆదివారం ఉదయం సింహపురి కాలనీలో పనిచేయడానికి యాక్టివా స్కూటీపై ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వారు పాత్రా ఇండియా కంపెనీ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఒడిశాకు చెందిన లారీ ఢీకొనడంతో డ్రైవ్ చేస్తున్న శ్రీరామమూర్తి తలకు గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఈశ్వర్ రావుకు చిన్న చిన్న గాయాలవడంతో వారిద్దరిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న వాకర్స్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకర్ ఆదినారాయణ స్మారక నడక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ వీటిని ప్రారంభించారు. పోటీల్లో 102 మంది పాల్గొనగా.. వీరిలో 42 మంది మహిళలు ఉన్నారు. 31-40, 41-50, 51-60, 61-70, 71-80, 81-90 వయసుల వారీగా విభజించి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు జరిపారు. ప్రతి విభాగం నుంచి మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందిస్తారు. ఈ పోటీల్లో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్, హెల్దీ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మా వాకర్స్ క్లబ్, యూనివర్సల్ హెల్త్‌క్లబ్, ఇతర వాకర్స్ పాల్గొన్నారు. వీరికి ఉదయం ఫలహారాలు అందించారు.

బహిరంగ సభకు తరలిరండి

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం కార్యకర్తల విస్తృత సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి బి. జగన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదని, కానీ ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తానని పదేపదే ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకోవాలంటే అఖిలపక్ష నాయకులను మోదీ దగ్గరకు తీసుకెళ్లే ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ చేస్తున్న ప్రకటనలపై వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం. సుబ్బారావు, పైడిరాజు, యూఎస్‌ఎన్ రాజు, వి. నరేంద్రకుమార్, బి. వెంకట్రావు, ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం.. మంచి నేస్తం



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి ఉండదని విశాఖ జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. మనం తలదించుకొని పుస్తకాన్ని చదివితే మనల్ని తలెత్తుకుని జీవించే విధంగా ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ధన సంపద కన్నా.. జ్ఞాన సంపద గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పి, వాటిని చదివించారు. పిల్లలకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నేడు 60వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు బర్మా కాలనీ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొంటారని కార్పొరేటర్ పి.వి.సురేష్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

సమాచారమ్

ప్రజా సేవలో జోన్-5 అధికారులు



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం అధికారులు పౌర సమాచారం అందిస్తారు. జోన్ పరిధిలో సమస్యలు, సందేహాలపై ఫిర్యాదులు చేయడానికి, ఏదైనా ఉపయోగకర సమాచారం తెలుసుకోవడానికి కింద పేర్కొన్న అధికారుల నంబర్లకు కాల్ చేయవచ్చు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో జోన్ ప్రజలు తమ సమస్యలపై అధికారులకు నేరుగా వినతిపత్రాలు అందజేయవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్(జెడ్సీ) ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 (రెవెన్యూ, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 (టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1(ఉత్తర)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2(పశ్చిమ)	79979 54406
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్ (అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో	81878 99199
శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ టీపీవో	70932 87310
కె.పద్మావతి	ఏపీడీ(యూసీడీ)	97013 85284
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్	98481 70067

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో ఎస్‌ఐ మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని హితవు పలికారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో.. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గొడవలకు దూరంగా ఉంటూ మంచిగా జీవించాలని సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించి వచ్చారు.

అనఘాదేవికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అనఘాదేవి

అల్లిపురం: వైశాఖ శుద్ధ తృతీయ సందర్భంగా అల్లిపురంలోని వివేకానందకాలనీలో గల షిర్డీ సాయి మందిరంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. దేవాలయం ఆవరణలో గల అనఘాదేవి అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల నేపథ్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారి ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుబేర, లక్ష్మీ పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు పేదలకు విసనకర్రలు, గొడుగులు, వస్త్రాలు, అన్నదానం, చెరుకురసం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.